## కాలస్పృహ

అనూరాధ బండి

ఈ రాత్రి ఇక్కడితో మొదలవ్వొచ్చు
ఈ చీకటి కొంచం కొంచం పలుచనవ్వొచ్చు
బహుశా ఈ రాత్రి ఎలాగో ముగియవచ్చు
నువ్వు నా సూర్యుడివని అన్నానా నేనూ..!?

రేపటికి కొన్ని ఊసులు దాచిఉంచాను
బహుశా అవి కలలకి రంగులు కూర్చవచ్చు
రేపెప్పుడయినా సీతాకోకచిలుకలు ఎదురైతే నవ్వుతావా.. !?

ఇక మళ్ళీ ఆకాశం గురించి ఏమని చెప్పాలి
ఈ రాత్రి గాఢాంధకారాన్ని ఎలా తరమాలనా
నువ్వు చంద్రుడివా అని అడిగానా ఎప్పుడయినా..!?

సూర్యుడినీ చంద్రుడినీ తలచాను సరే
ఆకాశం నువ్వని కలవరించిఉంటాను సరే
పగటినీడల నడుమ ఎదురైన కౌగిలి నువ్వన్నానా లేదా..!?

ఎంతయినా పగళ్ళు నీలా గడుస్తాయ్
రాత్రులు నువ్వై నిద్రలో నడుస్తాయ్
మరి నక్షత్రాలకి ఆ మెరుపు సంగతో..!?

★★★

# ఒక్కసారి జవాబుగా మారి..

శ్రీసాహితి

రోజులో
ఏదో ఓ సమయంలో
మాటల షార్టు షర్క్యూట్ .
చీకటిలో ఉండిపోతం
మౌనం ఇద్దరినీ నంజుకు తింటుంది.
. ...........
కాసేపు ఆగక
తగాదా అని నీవు - కాదని నేను
...........
నేను అడిగిందే కావాలని
ఇష్టం యుద్ధం చేస్తుంది నీతో
స్పందన లేకుండా గంట మాట్లాడతావు చప్పుడు కాకుండా
............
నీకేమి కావాలో చెప్పవు
నీకేది ఇవ్వాలో తెలియదు.
దేనికి చప్పుడు చేయదు
ఏది అర్ధం కాదు.....అర్ధముండదు
.......
కానీ ఏదో ఓ క్షణంలో ఇద్దరం కలిసినప్పుడు
దూరంగా మన మాటలు, చూపులు
వెక్కిరిస్తుంటే , నా భుజంపై వాలి బాధపడతావు
......
నేనేం చేయాలి?
మనమేమి కావాలి?

ఒక్కసారి జవాబుగా మారి ఎదుటకురా....
జీవితం ఎప్పటికీ
మనల్ని ఓడించలేదు... ★★★

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

జీవితమ్మెల్ల మది నిండె చింతతోడ
ఎపుడు సాధింతునీ భాగ్యమెప్పుడంచు
చేరువై తోచునంతలో దూరమౌను
తలపులను తక్కనెన్నడు దరికి రాదు

ఎల్లపుడు దానికై పరువెత్తుచుందు
అందుకొనగజాలను స్వప్నమందు తప్ప
గగనమును తాకు కాంచనక్ష్మాధరమ్మొ!
రాసులై యింట చేరెడు రత్నతతియొ!

స్వప్నమున గోచరించెడు సౌధమేమొ!
సాధ్యమే యంచునాశించు స్వర్గమేమొ!
పరితపించెదనందని ఫలము కొఱకు
బ్రతుకు సర్వమ్మునంతిమశ్వాస వరకు

ఆశ మరణించుటెరుగని యమృతజీవి
చాలునను మాట తెలియదు స్వాంతమునకు
ధనము వాహనగణమైన కనకమైన
వలదు చాలికయన్నట్టి తలపు లేదు

జనులకైనను భూరిరాజ్యములకైన
పెంపు చేయుటే ధ్యేయము సంపదలను
కాంక్షకెచ్చట ప్రతిబంధకమ్ము లేదు
అందగల్గిన వానికే హద్దు కలదు

COMMENTS